సాక్షి
మంచిర్యాల
గురువారం । 27 । జూన్ । 2024



రైళ్లు రద్దు.. బస్సు కష్టం
హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేశాఖ జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసింది. 8లో▸



వేతనాలు మహాప్రభో..!
సంచార పశువైద్యశాల సిబ్బంది వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 36మంది వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /26.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. వాతావరణం చల్లగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

విశిష్ట సేవలందించిన రాహుల్



అదనపు కలెక్టర్ రాహుల్ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

పాతమంచిర్యాల: జిల్లా అదనపు కలెక్టర్‌గా రాహుల్ విశిష్ట సేవలందించారని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బి.రాహుల్ బదిలీపై భద్రాచలం ఐటీడీఏ పీవోగా వెళ్తున్న సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. రాహుల్ దంపతులను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లాలో అనేక ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగంతో మమేకమై పని చేశారని చెప్పారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై శ్రద్ధ తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో నోడల్ అధికారిగా పని చేసి ఎన్నికలు సజావుగా జరిగేందుకు అహర్నిశలు కష్టపడ్డారని తెలిపారు. రాహుల్ మాట్లాడుతూ జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేసినందుకు సంతోషంగా ఉందని, విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

గొర్లకాపరులకు న్యాయం చేయాలి



కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న అశోక్

నెన్నెల: రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత గొర్రెల కోసం డీడీలు చెల్లించిన ప్రతీ ఒక్కరికి గొర్రెలు పంపిణీ చేసి న్యాయం జరిగేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్‌యాదవ్ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాంలను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. గొల్ల కుర్మలు రెండేళ్ల క్రితం అప్పులు చేసి ఒక్కొక్కరు రూ.43,750 చొప్పున రూ.468 కోట్లు డీడీల రూపంలో చెల్లించారని తెలిపారు. గత ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేయక మోసం చేసిందని పేర్కొన్నారు. గొర్లకాపరులు చెల్లించిన డబ్బులు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయాలని, గొర్రెల పంపిణీ పథకాన్ని పునరుద్ధరించి గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన వారు సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారుడు రాంచందర్‌యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమార్‌యాదవ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి మహేష్‌యాదవ్, వనపర్తి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు మధు, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

బదిలీలు నిలిపివేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనుల్లో పనిచేసే ఈపీ ఆపరేటర్లను మణుగూరుకు బదిలీ చేయడాన్ని నిలిపివేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా బుధవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ఏరియాల నుంచి ప్రతీ ఓపెన్ కాస్ట్‌లో ఐదుగురు చొప్పున ఈపీ ఆపరేటర్లను మణుగూరుకు ఆరు నెలల పాటు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తున్నారని, యాజమాన్యం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. దీన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం మొదలై పిల్లలు స్కూలు, కాలేజీల్లో అడ్మిషన్ తీసుకొని వెళ్తున్నారని, అకస్మాత్తుగా బదిలీ చేయడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని తెలిపారు. మ్యాన్‌పవర్ కొరత పేరుతో యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ నాయకులు రాచర్ల చంద్రమోహన్, ఫిట్ సెక్రెటరీ మోతే లచ్చన్న, నాయకులు బద్రి బుచ్చయ్య, గండి సతీష్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

అమాత్య ఆశలు!

- ఆశల పల్లకిలో ఎమ్మెల్యేలు
- పోటీలో పీఎస్సార్, వినోద్
- తమకే దక్కేలా లాబీయింగ్
- కేబినెట్‌లో చోటుపై వీడని ఉత్కంఠ



పీఎస్సార్



గడ్డం వివేక్



గడ్డం వినోద్



వెడ్మ బొజ్జు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను మంత్రి పదవి ఊరిస్తోంది. త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ రెండో విడత జరగబోతుందనే ప్రచారం నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. తొలి విడత కూర్పులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎవరికీ చోటు దక్కలేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క వ్యవహరిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు ఇక్కడి నేతలకు అవకాశం దక్కింది. అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న మంత్రులుగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల్లో ఎవరిని అమాత్య పదవి వరిస్తుందోనని రాజకీయ వర్గాలతోపాటు సామాన్యుల్లోనూ ఆతృత నెలకొంది.

పీఎస్సార్‌కు ఖాయమేనా?

తొలి విడతలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)కు బెర్త్ ఖాయమని ఆయన అనుచరులు ఆశలు పెంచుకున్నారు. అదే సమయంలో పోటీలో ఉన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఆయన సోదరుడు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ సైతం ఢిల్లీ స్థాయి పరిచయాలతో ఇరువురిలో ఒకరికి పదవి వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. అయితే ఎవరికీ చోటు దక్కలేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే వివేక్ తనయుడు వంశీకృష్ణకు పెద్దపల్లి ఎంపీగా టికెట్ ఇవ్వగా ఆయన గెలిచారు. ఈ క్రమంలో మంత్రి పదవి రేస్ నుంచి వివేక్ పక్కకు వెళ్లినట్లుగానే పార్టీలో కార్యకర్తలు భావిస్తున్నారు. ఒకే కుటుంబానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందనే కోణంలో వివేక్‌కు అవకాశాలు తగ్గాయి. ఇక సీనియర్లలో వినోద్, పీఎస్సార్ ఉండగా, ఖానాపూర్ నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉన్నారు. పార్టీ కష్టకాలం నుంచి అధికారంలోకి వచ్చేదాకా ఉమ్మడి జిల్లాలో బలోపేతం చేసిన నాయకుడిగా పీఎస్సార్‌కు పేరుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యాక మొదటిసారిగా ఇంద్రవెల్లి సభ నిర్వహించగా.. ఆ సభ నుంచే ఎన్నికల శంఖారావం పూరించారు. పీఎస్సార్ ఆ సమయంలో కష్టపడ్డారనే పేరుంది. ఒకే పార్టీని నమ్ముకున్న వ్యక్తిగా తమకే గ్యారంటీగా అవకాశం ఉంటుందనే ధీమాలో ఉన్నారు. కానీ.. గడ్డం వినోద్ ఇప్పటికే పలుమార్లు ఢిల్లీలో పదవి కోసం లాబీయింగ్ చేస్తున్నారు. ఏఐసీసీ పెద్దలను కలుస్తున్నారు. అధిష్టానం తనకే పదవి ఇచ్చే అవకాశం ఉందనే ఆశలో ఉన్నారు. ఈ క్రమంలో ఎవరికి బెర్త్ దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది. మంత్రి పదవి తమ నాయకుడికే ఇవ్వాలంటూ అనుచరగణం దేవాలయాల్లో పూజలు, ప్రార్థనలు చేస్తున్నారు. తమ ఎమ్మెల్యేకే కేబినెట్‌లో చోటు కల్పించాలని నాయకులు, కార్యకర్తలు అధిష్టానాన్ని కోరుతున్నారు.

అధిష్టానం మదిలో ఎవరో?

కాంగ్రెస్ అధిష్టానం ఆశీర్వాదం లేనిదే కేబినెట్‌లో బెర్త్ దక్కదు. ఈ క్రమంలో అధిష్టానం మదిలో ఎవరున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతోపాటు అందరినీ కలుపుకొనిపోతూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాల్సి ఉంది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుల, రాజకీయ సమీకరణాల కూర్పులో ఇక్కడ ప్రభావితం కానుంది. రాష్ట్ర మంత్రివర్గంలో మొత్తం 18మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం సీఎంతో కలిపి 12మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరుగురికి చోటు కల్పించవచ్చు. మొదటి విడతలో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం లేదు. ఈ క్రమంలో ఈ ప్రాంతాల నుంచి ఎంపిక చేస్తూనే ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సమీకరణ చేయాల్సి ఉంది. వీరికి అదనంగా ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి చేరుతున్న ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఉంటుందనే ప్రచారంలో ఎవరికి బెర్త్ దుక్కుతుందోననే స్పష్టత రావడం లేదు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందే విస్తరణ ఉంటుందని చెబుతున్నా, స్థానిక సంస్థలు, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల వరకు వేచి చూడక తప్పదనే వాదనలూ ఉన్నాయి. ఈ క్రమంలో ఎవరికి మంత్రి పదవి వస్తుందోనని వేచి చూడాల్సి ఉంది. మరోవైపు ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు దక్కితే ఈ ప్రాంత అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందనే ఆశలు ఉన్నాయి.

అందని పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు(ఫైల్)

- అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన కందిపప్పు సరఫరా
- కొనలేని స్థితిలో కూరగాయల ధరలు
- సరఫరా చేసే కోడిగుడ్లు చిన్నవే

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందకుండా పోతోంది. సకాలంలో సరుకులు అందించడంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అలసత్వం వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతీ రోజు మధ్యాహ్నం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం పెట్టాల్సి ఉంటుంది. గత నెలన్నర రోజులుగా కేంద్రాలకు కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. ఏ కూరగాయ ధర అయినా కిలోకు రూ.70కి పైగా ఉండగా, టమాటా ధర రూ.100కు చేరింది. దీంతో కూరగాయలూ కొనలేని పరిస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాల్లో నిల్వ ఉన్న పప్పు అయిపోవడంతో ఇతర కేంద్రాల్లోని పప్పును అరువుగా తీసుకుని నెట్టుకొస్తున్నారు. మరికొద్ది రోజుల్లో నిల్వలు నిండుకుంటే అధిక ధరలతో కూరగాయల భోజనం పెడతారా లేదా అనేది అనుమానమే. కొందరు టీచర్లు సొంత డబ్బులతో పప్పు కొనుగోలు చేసి వండుతున్నారు. మాతా, శిశు మరణాల నివారణకు సరైన పౌష్టికాహారం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. గతంలో జిల్లాలో పాలు, కందిపప్పుల సరఫరాకు టెండర్లు వేసేవారు. కొన్నేళ్లుగా రాష్ట్ర స్థాయిలోనే టెండర్లు వేసి సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది మార్చితో కంది పప్పు సరఫరా టెండర్ ముగియడంతో కొత్తగా టెండర్లు పిలవడంలో జాప్యం జరుగుతోంది. దీంతో జిల్లా స్థాయిలోనే ఇటీవల రెండు నెలలపాటు పప్పు సరఫరాకు టెండర్లు పిలిచి తెప్పించినా ఆ గడువు కూడా పూర్తయింది. మరోసారి టెండర్లు పిలవాల్సి ఉండగా నెలన్నరగా జాప్యం జరుగుతుండడంతో కేంద్రాలకు పప్పు చేరడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న కోడిగుడ్లు సరఫరా చేయడంతో లబ్ధిదారులకు సరైన పోషకాలు అందడం లేదు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు
బెల్లంపల్లి	279	10,827
చెన్నూరు	245	7,854
లక్సెట్టిపేట	203	8,218
మంచిర్యాల	242	13,398
మొత్తం	969	40,297

సరుకుల సరఫరాపై పట్టింపేది..!

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఏడు నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 40,297మంది, 4,550 మంది గర్భిణులు, 3,987మంది బాలింతలు ప్రతీ రోజు మధ్యాహ్నం పౌష్టికాహారం పొందుతున్నారు. ఆరోగ్య లక్ష్మి పథకం కింద గర్భిణులు, బాలింతలకు రోజు మధ్యాహ్నం భోజనం, బాలింతలకు 200మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నారు. ఎక్కువగా పప్పు, ఆకుకూరలు కలిపిన కూరతోనే భోజనం వడ్డిస్తున్నారు. జిల్లా స్థాయిలోనే కోడిగుడ్ల సరఫరా చేస్తుండగా అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా వాటిపై 'అంగన్‌వాడీ గుడ్డు–తెలంగాణ ప్రభుత్వం' అనే ముద్ర వేస్తోంది. మొదటి విడతలో నీలం రంగు, రెండో విడత ఎరుపు రంగు, మూడో విడతలో ఆకుపచ్చ రంగుతో కూడిన ముద్రలు వేసి సరఫరా చేస్తున్నారు. దీంతో కోడిగుడ్ల పంపిణీ జరిగిందో లేదో తెలుసుకునేందుకు అవకాశం ఉంది. పౌష్టికాహారం అందించడం నిరంతర ప్రక్రియ కాగా, టెండర్ల పేరుతో నెలల తరబడి జాప్యం చేయడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టెండర్లు నిర్వహిస్తాం



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పు సరఫరాకు రాష్ట్రస్థాయిలోనే టెండర్లు పిలుస్తారు. రాష్ట్రస్థాయిలో టెండరు ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో మరోసారి జిల్లాలోనే టెండరు నిర్వహించి, అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పు సరఫరా జరిగేలా చూస్తాం. చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

జిల్లా అధికారుల కో ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

పాతమంచిర్యాల: జిల్లా అధికారుల హౌజ్ బిల్డింగ్ మ్యూచ్‌వల్ కో ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాతరాజుల దుర్గాప్రసాద్(ఎస్సీ కార్పొరేషన్ ఈడీ), ప్రధాన కార్యదర్శిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్‌డీవో) కిషన్, కోశాధికారిగా ఏ.పురుషోత్తం(జిల్లా వయోజన విద్య ప్రాజెక్టు అధికారి), ఉపాధ్యక్షులుగా వి.గణపతి నాయక్(జెడ్పీ సీఈవో), ఆర్.శైలజ(జిల్లా ఇంటర్మీడియట్ అధికారి), అసోసియేట్ అధ్యక్షులుగా డి.వెంకటేశ్వర్‌రావు(జిల్లా పంచాయతీ అధికారి), కే.చిన్నయ్య(జిల్లా సంక్షేమ అధికారి), సంయుక్త కార్యదర్శులుగా ఎస్.యాదయ్య(డీఈవో), ఎన్.రాజేశ్వరీ(జిల్లా మైనారిటీ శాఖ అధికారి), యం.గంగారాం(జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి), కే.తిరుపతి(లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్), ఆర్గనైజర్‌గా పి.రవీందర్‌రెడ్డి(షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు), యం.స్వామిరెడ్డి(పంచాయతీరాజ్ ఈఈ), యం.శ్రీనివాస్(ల్యాండ్ సర్వే), ముఖ్య సలహాదారులుగా సబావత్ మోతీలాల్(జిల్లా అదనపు కలెక్టర్), నర్సింహచారి(రోడ్లు భవనాల శాఖ), న్యాయ సలహాదారులుగా యం.హరనాథ్(జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్), కే.రాజవీరు(జిల్లా యువజన క్రీడా అధికారి), కార్యవర్గ సభ్యులుగా జి.గోపాల్(సివిల్ సప్లయి జిల్లా మేనేజర్), వి.ఉదయ(డీహెచ్‌ఎస్‌వో), వై.గజానంద్(జిల్లా మార్కెటింగ్ అధికారి)లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి శాలువాతో సన్మానించారు.

28న స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు ఈ నెల 28న నిర్వహించనున్న ట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 మండలాల్లో పాల్గొన్న 4వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఆధార్‌కార్డు, స్టడీ, కుల, జనన సర్టిఫికెట్లు, నాలుగు పాస్‌ఫొటోలు, 3వ తరగతి పాసైన ప్రోగ్రెస్ రిపోర్టు, రెండు కాపీల జిరాక్సులతో హాజరు కావాలని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రిపోర్టు చేయాలని, ఎంపికకు సంబంధించిన క్రీడాంశాల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు సీహెచ్.రాజేశ్ 99635 39234, పరిమల 9849158627, 94401 41328, 9666026047, 9490919110 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బదిలీలపై ఎస్జీటీల నిరీక్షణ

- ఆరు రోజులు గడిచినా వెలువడని షెడ్యూల్
- ఖాళీలు, సీనియార్టీ జాబితాపై సందిగ్ధత



మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ ముగిసి ఆరు రోజులు గడుస్తున్నా ఎస్జీటీలకు నిరీక్షణ తప్పడం లేదు. ఈ నెల 18న ఎస్‌ఏలకు పదోన్నతుల ఆర్డర్ కాపీలు అందడంతో 19న కొత్త పాఠశాలల్లో చేరారు. 22న ఎస్జీటీల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా ఎటూ తేల్చలేదు. పదోన్నతులతో ఏర్పడిన ఖాళీలను బదిలీలతో భర్తీ చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. ఒకే పాఠశాలలో రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారు దరఖాస్తు చేసుకుంటే బదిలీ చేస్తారు. మారుమూల ప్రాంతాల్లో దాదాపు 13ఏళ్లకు పైగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్జీటీలు బదిలీ కోసం ఎదురు చూస్తున్నా రు. ఇప్పటికే ఖాళీలు, సీనియారిటీ జాబితా ప్రకటించాల్సి ఉండగా అటువైపు అడుగులు పడడం లేదు. దీంతో షెడ్యూల్ రాకపోగా బదిలీపై వెళ్లే అవకా శం ఉన్న టీచర్లు బోధనపై శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది. ఫలితంగా విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతోంది. మరోవైపు బదిలీలు ఉంటాయా..? లేదా..? అనేది తెలియని పరిస్థితి నెలకొంది.

ఆలస్యమేలా..!

జిల్లాలో ఎస్జీటీలు, పండిత్, పీఈటీలు కలిపి 430 మందిపైగా స్కూల్ అసిస్టెంట్లు, అందుకు సమాన హోదా కల్పించారు. ప్రస్తుతం ఎస్జీటీల బదిలీల ప్రక్రియ చేపట్టనుండడంతో గతంలో ఎస్జీటీల ఖాళీలకు తోడు పదోన్నతుల అనంతరం మిగిలిన ఖాళీలను బదిలీలతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. పదోన్నతులతో ఖాళీ అయిన పోస్టులు, క్లియర్ వెకెన్సీ పోస్టులు, దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారి పోస్టులు ప్రసుత్తం బదిలీకి దరఖాస్తు చేసుకున్నవారితో నింపనున్నారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు కొత్త పాఠశాలల్లో చేరేందుకు 15రోజుల గడువు ఉండడంతో రిపోర్టు చేయడంలో తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు సాంకేతిక కారణాలు కూడా తోడయ్యాయి. దీంతో అసలు ఖాళీల లెక్క తేలేందుకు ఆలస్యమవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికార లెక్క ప్రకారం మొత్తానికి 500పైన ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి.

ప్రాథమిక పాఠశాలలపై ప్రభావం

చాలా సంవత్సరాల తర్వాత బదిలీలు, పదోన్నతులు చేపట్టగా ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పదోన్నతులతో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఏల ఖాళీల సంఖ్య తగ్గినా.. ఈ ప్రభావం ప్రాథమిక పాఠశాలలపై పడనుంది. ఎస్జీటీల పదోన్నతుల్లో భాగంగా 430 మంది ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్నత పాఠశాలలకు వెళ్లారు. ప్రాథమిక పాఠశాలలో ఏర్పడిన ఖాళీలతోపాటు బదిలీలు పూర్తయితే ఎస్జీటీలు వెళ్లనుండడంతో బోధన ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఖాళీలను భర్తీ చేసే వరకు వీవీలను నియమిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు లేకపోలేదు. బదిలీల షెడ్యూల్ విడుదలై, బదిలీలు పూర్తయితేనే ఏంత మేర ఖాళీలు ఉంటాయో స్పష్టత వస్తుంది.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేద్దాం



ర్యాలీలో కలెక్టర్ కుమార్ దీపక్, ఏసీపీ ప్రకాశ్, అదనపు కలెక్టర్ మోతిలాల్, అధికారులు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- మంచిర్యాలలో భారీ ర్యాలీ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

మంచిర్యాలక్రైం: మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరూ సమన్వయంతో కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసు, ఎక్సైజ్ శాఖలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు స్థానిక ఐబీ చౌరస్తా నుంచి ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. డ్రగ్స్ వినియోగం సరదాగా మొదలుపెట్టి బానిసగా మారి కన్నవారిని కడుపుకోతకు గురి చేస్తున్నారని తెలిపారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, గుట్కా, అంబార్, తంబాకు, సిగరేట్, ఖైని గుట్కాను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే 14446, 8712671111 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచాం అందించాలని తెలిపారు. అనంతరం ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్జర్ ఫ్రేమ్‌లో కలెక్టర్ స్వయంగా సెల్ఫీ దిగారు. కళాబృందం పాటలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ర్యాలీలో పాల్గొన్న వారితో మాదక ద్రవ్య నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, ఏసీపీ ప్రకాశ్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, డీఆర్‌డీఓ కిషన్, జిల్లా విద్యాధికారి యాదయ్య, ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వంగ చక్రపాణి, ఎన్‌సీసీ అధికారి బీ.తిరుపతి, ఎన్‌సీసీ విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ఎమ్మెల్యే వినోద్ విఫలం'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

బెల్లంపల్లి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.రఘునాథ్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని అగర్వాల్ భవన్‌లో పార్లమెంటు ఎన్నికలపై అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల కన్నా పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ ఓట్లు రావడం శుభ పరిణామమని తెలిపారు. తాగునీరు, రోడ్లు, మురికినీటి కాలువలు తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలిచ్చి ఎన్నికల్లో గెలిచిన వినోద్ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు నెలకు రూ.2,500, రూ.4000 పింఛన్లు, రైతు భరోసా తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ, రజనీష్‌జైన్, దుర్గం అశోక్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, నాయకులు రాచర్ల సంతోష్, దార కళ్యాణి, బుడిమే విజయ్, సూరం సంపత్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు పాల్గొన్నారు.

ఏబీవీపీ బంద్ విజయవంతం



సినిమావాడ హైస్కూల్‌లో తరగతుల బహిష్కరణ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఏబీవీపీ బుధవారం చేపట్టిన బంద్ జిల్లాలో విజయవంతమైంది. రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌లో భాగంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్వచ్ఛందంగా పాల్గొనగా, ప్రభుత్వ పాఠశాలల తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మారినా పరిపాలన విధానం మారలేదని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, వెంటనే ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 24వేలకు పైగా ఉన్న టీచర్ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్, స్కావెంజర్లను నియమించాలని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రోహిత్, సాయి, శేషి, సందీప్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి


టేకుమట్ల శివారులో మృతి చెందిన గేదె

జైపూర్: మండలంలోని ఇందారంలో తంగళ్లపెల్లి మల్లేశ్వరికి చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. బుధవారం మేత కోసం వెళ్లిన గేదె టేకుమట్ల శివారులో మేస్తుండగా వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.85 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

నాన్‌బెయిలబుల్ వారెంట్‌పై ఇద్దరి అరెస్ట్

మంచిర్యాలక్రైం: స్థానిక మహిళా పోలీస్ స్టేషన్లో 2018లో నమోదైన వరకట్నపు వేధింపుల కేసులో ఇద్దరు నిందితులను నాన్ బెయిలబుల్ వారెంట్‌పై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ రాజమౌళి గౌడ్ బుధవారం తెలిపారు. 2018 నవంబర్ 10న రామిల్ల మానస ఫిర్యాదు మేరకు లక్సెట్టిపేట మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రామిల్ల ప్రసాద్, రామిల్ల రాజమ్మ కోర్టు వాయిదాల ప్రకారం హాజరు కాకపోవడంతో రెండవ అదనపు జుడీషియల్ మెజిస్ట్రేట్ నిరోష నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ఈ మేరకు ఎస్‌బీడబ్ల్యూ పోలీస్ టీమ్ సహకారంతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కత్తితో దాడిచేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు

మంచిర్యాలక్రైం: కత్తితో గాయపరిచిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1200ల జరిమానా విధిస్తూ అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి బుధవారం తీర్పునిచ్చినట్లు కోర్టు లైసన్ ఆఫీసర్ గులామ్ దస్తగిర్ తెలిపారు. 2015 ఆగస్టు 6న భీమిని మండలం మామడిపల్లి గ్రామానికి చెందిన టాక్రే నరేష్ మండల కేంద్రంలోని సర్దార్ సాహెబ్ హుస్సేన్ వద్ద చికెన్ కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అందులో వ్యర్థ పదార్థాలు కలుపుతుంటే వద్దని వారించినందుకు ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపంతో చికెన్ సెంటర్ యజమాని సర్దార్ సాహెబ్ హుస్సేన్ తన చేతిలో ఉన్న కత్తితో నరేష్‌పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడు నరేష్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితునికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9వేల నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ వివరించారు.

రైళ్లు రద్దు.. బస్సు కష్టం

- గగనమవుతున్న టికెట్ రిజర్వేషన్
- రాత్రివేళ ప్రయాణంపై ఆసక్తి


బెల్లంపల్లి పాత బస్టాండ్ వద్ద అర్ధరాత్రి బస్సెక్కుతున్న ప్రయాణికులు

బెల్లంపల్లి: హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైళ్లు రద్దు కావడంతో అగచాట్లకు గురవుతున్నారు. వందలాది మంది ప్రయాణికులను రోజువారీగా గమ్యస్థానం చేరుస్తున్న ఆర్టీసీ బస్‌లో టికెట్ రిజర్వేషన్‌కు తంటాలు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల ఆర్టీసీ బస్ డిపోల నుంచి హైదరాబాద్‌కు నిత్యకృత్యంగా వెళ్తున్న బస్సుల్లో రాత్రి పూట జర్నీకి బస్ టికెట్ రిజర్వేషన్ చేసుకోవాలంటే గగనమవుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక్కోసారి ప్రయాణాన్ని మరుసటి రోజుకు వాయిదా వేసుకోవడమో లేదా అత్యవసరం రీత్యా కారు అద్దెకు తీసుకుని వెళ్లడమో చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

తాత్కాలికంగా రైళ్ల రద్దుతో...

వరంగల్ జిల్లా ఖాజీపేట్, మహారాష్ట్రలోని బల్లార్షా రైల్వే జంక్షన్‌ల మధ్య మూడో రైల్వే లైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొన్ని రైల్వే స్టేషన్‌ల మధ్య పనులు దాదాపు పూర్తికావచ్చినా అక్కడక్కడ ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం రేచినీ రోడ్ రైల్వే స్టేషన్, ఆసిఫాబాద్ ఎక్స్ రోడ్ రైల్వేస్టేషన్ల మధ్య మూడోలైన్ పనులు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా హైదరాబాద్–బల్లార్షా మధ్య రాకపోకలు సాగించే భాగ్యనగర్, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, భద్రాచలం రోడ్, ఖాజీపేట్–బల్లార్షాల మధ్య నడిచే రామగిరి, సింగరేణి ఫ్యాసింజర్ రైళ్ల రాకపోకలను ఇటీవల తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ కారణంగా వరంగల్,హైదరాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, తదితర ప్రాంతాలకు వెళ్లడానికి అనివార్యంగా ఆర్టీసీ బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికుల రద్దీ పెరగడంతో బస్ టికెట్ రిజర్వేషన్ కాక తంటాలు పడుతున్నారు.

టికెట్ కోసం ఆరాటం

ఆసిఫాబాద్ డిపో నుంచి బయలు దేరే ఆర్టీసీ బస్సులు వయా కాగజ్‌నగర్, రెబ్బెన, గోలేటి టౌన్‌షిప్, తాండూర్, బెల్లంపల్లి, సోమగూడెం, మందమర్రి, మంచిర్యాల మీదుగా వెళ్తుండగా మంచిర్యాల డిపో బస్సులు చెన్నూర్, జైపూర్, భీమారం, శ్రీరాంపూర్, దేవాపూర్ మీదుగా హైదరాబాద్ వెళ్తున్నాయి. మంచిర్యాల చేరువలో ఉన్న రామకృష్ణాపూర్, హాజీపూర్, లక్సెట్టిపేట, తదితర ప్రాంతాల ప్రయాణికులు మంచిర్యాలకు వచ్చి బస్సెక్కుతున్నారు. అదేతీరుగా బెజ్జూర్ నుంచి కాగజ్ నగర్ మీదుగా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్ సర్వీసును నడుపుతున్నారు. ప్రస్తుతం విద్యాసంస్థలు పునఃప్రారంభం కావడంతో పాటు కొత్తగా అడ్మిషన్లు సైతం జరుగుతున్నాయి. హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నారు. ఇదే క్రమంలో రోజువారీగా వ్యాపార, వాణిజ్య వర్గాలు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో బస్ టికెట్ రిజర్వేషన్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇటీవల ఆసిఫాబాద్ నుంచి ఓ ప్రైవేట్ బస్ సర్వీసు హైదరాబాద్‌కు రాకపోకలు చేస్తున్నా ప్రయాణికుల రద్దీలో తేడా ఉండటం లేదు. బస్ టికెట్ ఖరారు కాకపోతే అద్దె కారులో గమ్యస్థానం చేరుకోవడానికి వెనుకాడని పరిస్థితులు నెలకొంటున్నాయి. తాత్కాలికంగా రద్దయిన రైళ్లు పునఃప్రారంభం అయ్యేవరకు బస్ ప్రయాణం కష్టతరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

రాత్రిపూట బస్ సర్వీసులకు డిమాండ్

రైళ్లు రద్దు కావడంతో చాలామట్టుకు ప్రయాణికులు రాత్రిపూట బస్సుల్లో జర్నీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. టికెట్ రిజర్వేషన్ చేసుకుని ఎంచక్కా నిద్రపోతూ తెల్లవారు జామున గమ్యస్థానం చేరుకోవచ్చనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ రాత్రిపూట ప్రయాణాన్ని ఎంచుకుంటున్నారు. దీంతో రాత్రి 7:30 గంటల నుంచి 12 గంటల వరకు నిమిషాల తేడాతో ఆర్టీసీ బస్సులు హైదరాబాద్ వెళ్తున్నాయి. ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి బస్ సర్వీసులు మంచిర్యాల డిపో నుంచి 11, కుమురం భీమ్ ఆసిఫాబాద్ డిపో నుంచి 9 చొప్పున బస్ సర్వీసులు బయలుదేరుతున్నాయి. అయినా ప్రయాణికుల జర్నీ కష్టాలు మాత్రం తీరడం లేదు.

టికెట్ రిజర్వేషన్ కష్టమవుతోంది



భాగ్యనగర్, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు కావడంతో హైదరాబాద్ వెళ్లడానికి బస్సు ప్రయాణమే దిక్కవుతోంది. ధర కాస్తా అధికంగా ఉన్నా ఆన్‌లైన్‌లో టికెట్ ఖరారు కావడం గగనమవుతోంది. సీట్ రిజర్వేషన్‌కాక ఒక్కోసారి ప్రయాణం వాయిదా వేసుకుంటున్నాం.
– మాసాడి గణపతి, వ్యాపారి, బెల్లంపల్లి

రాత్రి జర్నీకే ఆసక్తి..

హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు దాదాపు పగటి పూట ప్రయాణం ఇష్టపడటం లేదు. రాత్రిపూట జర్నీ చేయడానికే ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగా రాత్రి నడిచే బస్ సర్వీసులకు డిమాండ్ పెరిగి టికెట్ రిజర్వేషన్ కావడం ఇబ్బందిగా మారుతున్నట్లు తెలుస్తోంది. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఎప్పటి కప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నాం. – విశ్వనాథ్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆసిఫాబాద్

సింగరేణి ఉద్యోగికి అంబేద్కర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న లక్ష్మణ్‌దాస్

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన సింగరేణి ఉద్యోగి, సామాజిక కార్యకర్త బన్న లక్ష్మణ్‌దాస్‌కు అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్నారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమి నిర్వహించిన కార్యక్రమంలో అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

బంకర్ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ బుధవారం మెరిట్ బంకర్ పనులను పరిశీలించారు. బంకరులో ఎప్పటికప్పుడు వాటర్ స్ప్రే చేసిన తర్వాతే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. లోడింగ్‌కు ఎలాంటి ఆటంకం కలుగకుండా పనులు కొనసాగించాలన్నారు. ఆయన వెంట సీహెచ్‌పీ ఇన్‌చార్జి ఇంజినీర్ చంద్రమౌళి, డీవైఎస్ఈ అశోక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కన్వెయన్స్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కే.రాజ్‌కుమార్ బుధవారం సీఎండీ బలరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్వెయన్స్ డ్రైవర్లకు వేతనాలు సక్రమంగా రావడంలేదన్నారు. వేతనాల్లో కట్ చేసిన సీఎంపీఎఫ్ డబ్బులు చెల్లించకుండా వారే వాడుకుంటున్నారన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, టెండర్లలో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి, నాయకులు అక్బర్ అలీ, తదితరులు ఉన్నారు.

నన్ను బతికించండి.. నాభార్యను కాపాడుకోవాలి..

- సంఘటన స్థలంలో బాధితుడి ఆక్రందన
- భార్యకు టిఫిన్ తీసుకెళ్తుండగా ఢీకొట్టిన లారీ
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


సంఘటన స్థలంలో దేవి సత్యనారాయణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నన్ను బతికించండి.. నా భార్యను కాపాడుకోవాలి.. అంటూ బాధితుడు చేసిన ఆక్రందన పలువురిని కలిచివేసింది.. ఈ ఘటన హాజీపూర్ మండలం గుడిపేట జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల మేరకు నంనూర్‌కు చెందిన దేవి సత్యనారాయణ (43) చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య పోసక్క, కుమార్తెలు సౌమ్య, సహజ ఉన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న పోసక్క రెండేళ్లుగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉండడంతో ఇంటి వద్దే చికిత్స తీసుకుంటోంది. సత్యనారాయణ రోజు హోటల్ నుంచి టిఫిన్ తీసుకొచ్చి ఆమెకు ఇస్తుండేవాడు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం టిఫిన్ తెచ్చేందుకు అదే గ్రామానికి చెందిన కారుకూరి తిరుపతితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గుడిపేట జాతీయ రహదారిపై లిక్కర్ గోదాం సమీపంలోకి రాగానే బైక్‌ను లారీ ఢీ కొట్టింది. దీంతో తిరుపతికి స్వల్పంగా సత్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోజూ ఉదయాన్నే టిఫిన్ తీసుకొచ్చే భర్త ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ప్రమాద ఘటన తెలియని పోసక్క తన కుమార్తెలతో 'నాన్నకు ఫోన్ చేయండి.. నాకు ఆకలేస్తోంది' అనడంతో ఆ కుమార్తెలు పడిన బాధ వర్ణనాతీతం. మృతుని సోదరుడు పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎస్‌డీఎల్ యంత్రాలను ప్రారంభిస్తున్న మేనేజర్

శ్రీరాంపూర్: ఎస్‌డీఎల్ యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్పీ 3, 3ఏ గని మేనేజర్ సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం గనిలో కొత్తగా 6 ఎస్‌డీఎల్ యంత్రాలను ప్రవేశపెట్టారు. వాటికి ఆయన పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి అధికంగా ఎస్‌డీఎల్ యంత్రాల ద్వారానే జరుగుతుందని తెలిపారు. యంత్రాల నిర్వహణ సరిగ్గా చూసుకుంటూ పనిగంటలు పెంచితే కంపెనీకి మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. లక్ష్యాలను సాధించడానికి ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని, రక్షణతో పనిచేస్తూ ఉత్పత్తి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని రక్షణ అధికారి శ్రీధర్, పిట్ సెక్రెటరీ మురళి చౌదరి, సంక్షేమ అధికారి గౌస్ పాషా, పిట్ ఇంజనీర్ ప్రేమ్ కుమార్, అధికారులు సాయి, శ్రావణ్ పాల్గొన్నారు.

అద్దె చెల్లించని ఎక్సైజ్ అధికారులు

- ఆందోళన వ్యక్తం చేసిన యజమాని


వాగ్వాదానికి దిగుతున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కోర్టు రోడ్డులో బోట్టుపల్లి పత్రు ఇంటిని అబ్కారీ శాఖ కార్యాలయం నిమిత్తం నెలకు రూ.12 వేల చొప్పున అద్దెకు తీసుకున్నారు. రెండేళ్లుగా ఇంటి యజమానికి అద్దె చెల్లించడంలేదు. బుధవారం యాజమానికి చెప్పకుండా అధికారులు కార్యాలయ సామగ్రి తరలించే ప్రయత్నం చేశారు. స్థానికులు గమనించి యజమానికి తెలియజేయడంతో అతను వచ్చి అధికారులను ప్రశ్నించగా మాకు సంబంధం లేదన్నారు. అద్దెకు సంబంధించిన బిల్లు ప్రభుత్వం నుంచి వస్తే మీ ఖాతాలోనే జమవుతాయని తెలపడంతో యజమాని ఏంచేయాలో తెలియక కార్యాలయానికి తాళం వేసే ప్రయత్నం చేశాడు. దీంతో సంబంధిత అధికారులు కార్యాలయం నుంచి బయటికి రావడానికి నిరాకరించారు. ఈ సందర్భంగా యజమాని మాట్లాడుతూ రెండేళ్ల నుంచి అద్దె రూ.2.88 లక్షలు, కరెంట్ బిల్లు రూ.40 వేలు పెండింగ్‌లో ఉన్నాయని, నాకు సమాచారం ఇవ్వకుండా కార్యాలయ సామగ్రి తరలిస్తున్నారన్నారు. అద్దె చెల్లించి సామగ్రి తీసుకెళ్లామంటే ప్రభుత్వానికి బిల్లులు పెట్టాం.. వస్తే తీసుకో.. లేదంటే మేము ఏం చేయాలేమని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎస్సై రాజశేఖర్ వచ్చి చర్చలు జరపగా ఈ నెల 29లోగా కరెంట్ బిల్లు చెల్లిస్తామని సంబంధిత అధికారులు ఒప్పుకున్నారు. ఈలోగా సామగ్రి కలెక్టరేట్‌కు తరలిస్తే తమని ఆదుకునే వారెవరని యజమాని ఆందోళన చెందడం కొసమెరుపు.

'కుంటాల' అభివృద్ధికి కృషి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా
- జలపాతం వద్ద హరిత హోటల్ కోసం స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్, తదితరులు

నేరడిగొండ: కుంటాల జలపాతం అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ అన్నారు. మండలంలోని కుంటాల జలపాతాన్ని వారు బుధవారం సందర్శించారు. అందుబాటులో ఉన్న వసతుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటిన అనంతరం హరిత హోటల్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. రూ.3 కోట్ల 81లక్షలతో హోటల్, కార్టెజ్, సీసీరోడ్లతో పాటు ఇతర పనులు మంజూరు కాగా, టెండర్ సైతం పూర్తయిందన్నారు. వర్షాకాలంలో జలపాతంలో వరదనీరు అధికంగా చేరడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అడవి మధ్యలో హోటల్ నిర్మాణం చేపడతామని డీఎఫ్‌వో పేర్కొనగా, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టైగర్‌జోన్‌లో అడవి ఉన్నందున పర్యాటకులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. వారి వెంట ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు, ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎఫ్ఆర్‌వో గణేశ్, ఆర్ఐ నాగోరావు, సర్వేయర్ శంకర్, ఎఫ్ఎస్‌వోలు వసంత్ కుమార్, ధన్ సింగ్, భీంజినాయక్, ఎఫ్‌బీవో సచిన్ గ్రామస్తులు అశోక్, సోమన్న తదితరులున్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కైలాస్‌నగర్: కుంటాల పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రహదారులపై జిల్లా లెవల్ కోఆర్డినేషన్ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఆర్అండ్‌బీ, పీఆర్, ఐటీడీఏ శాఖల ద్వారా చేపడుతున్న అటవీ రహదారి నిర్మాణ అభివృద్ధి పనుల సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. పెండింగ్ వివరాలు తెలుసుకున్నారు. త్వరగా ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వంతెనలు, రహదారులకు సంబంధించి త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అటవీ క్లియరెన్స్ కోసం రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సమావేశంలో ఆర్డీవో వినోద్ కుమార్, జీవకార్‌రెడ్డి, ఐటీడీఏ ఈఈ భీమ్‌రావ్, ఆర్ అండ్‌బీ నర్సయ్య, సురేశ్, ఇంజనీర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇంటి సామగ్రి

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి క్వాటర్‌లో నివాసం ఉంటున్న సిరికొండ తిరుపతి ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న సామగ్రి దగ్ధమైంది. ప్రమాదంలో రూ.30వేల నగదుతో పాటు బీరువాలో దాచుకున్న అరతులం బంగారం, మంచాలు, ఫ్యాన్లు, కూలర్లు, బీరువా, దుస్తులు, వంట సామగ్రి మంటల్లో కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఆర్ఐ ప్రేం కిరణ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి రూ.1,13,500 ఆస్తినష్టం జరిగిందని అంచనా వేశారు.

మూడు ప్రైవేట్ బస్సులు సీజ్

ఆదిలాబాద్‌రూరల్: మావల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఆర్టీఏ, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన మూడు ప్రైవేట్ బస్సులను సీజ్ చేసి జరిమానా విధించినట్లు ఏఎంవీఐలు మహేష్, సురేష్, హరీంద్ర కుమార్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రైవేట్ బస్సులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు మహాప్రభో..!

- జీతాలు రాక ఇబ్బందుల్లో సంచార వైద్య వాహన సిబ్బంది
- ఉమ్మడి జిల్లాలో 9 వాహనాలు, 36 మంది సిబ్బంది
- వేతనాలు విడుదల చేయాలని వేడుకోలు



సంచార వైద్య వాహనం

చెన్నూర్: పాడి సంపద పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1962 సంచార పశు వైద్య వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం 2017లో పశువులకు వైద్య సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 100 వాహనాలు ఏర్పాటు చేసింది. అందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 9 మంజూరు చేసింది. ఒక్కో వాహనంలో వైద్యునితో పాటు మరో ముగ్గురు సిబ్బంది పని చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 9 మంది వైద్యులు, 9 మంది డ్రైవర్లు, 9 మంది టెక్నీషియన్లు, 9 మంది అటెండర్ల చొప్పున 36 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 1962 సంచార పశు వైద్య వాహనం ద్వారా పశువులకు సకాలంలో వైద్య సేవలందడంతో గ్రామాలలో పశు మరణాలు తగ్గుముఖం పట్టాయి.

గతేడాది నుంచి బడ్జెట్ కేటాయించని ప్రభుత్వం

ప్రభుత్వం గతేడాది నుంచి 1962 వాహనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడంతో మందుల కొరత ఏర్పడింది. ఉన్న మందులతో సిబ్బంది పశువులకు వైద్య సేవలందిస్తున్నారు. వైద్యసేవలు నిలిచిపోకుండా జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ వాహనాల బాధ్యతలు చేపట్టింది. అయినప్పటికీ మందుల కొరత కొనసాగుతోంది. సిబ్బందికి సైతం వేతనాలు సకాలంలో అందడంలేదు. ప్రభుత్వం 1962 వాహనాల బలోపేతానికి నిధులు మంజూరు చేసి మందుల కొరతను నివారించాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా సిబ్బందికి సక్రమంగా వేతనాలు చెల్లించాలని 1962 వాహన సిబ్బంది కోరుతున్నారు.


పశువుకు వైద్య సేవలందిస్తున్న వెటర్నరీ వైద్యులు

సకాలంలో ఇవ్వాలి



మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయడమే కాకుండా ప్రతీనెల సక్రమంగా ఇవ్వాలి. – డాక్టర్ భవాని ఠాకూర్, మంచిర్యాల

భారమైన కుటుంబ పోషణ



మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వేతనాల కోసం ప్రతీరోజు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.– ప్రకాశ్‌గౌడ్, కెప్టెన్, చెన్నూర్